

గణపవరం తహశీల్దార్‌గా లక్ష్మి



ప్రజాశక్తి - గణపవరం

గణపవరం తహశీల్దార్‌గా ఎన్‌వియస్‌ఎస్.లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మి నిడమర్రు మండల సివిల్ సప్లయిస్ డిటిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై తహశీల్దార్‌గా గణపవరం వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పనిచేసిన కృష్ణస్వామి నిడమర్రు డిటిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మిని కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

మా ఇంటికి మేమే సారథులం..!

వైసిపి ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు

నేడు జిల్లాలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం

అడ్డుకునే ఆలోచనలో టిడిపి, జనసేన



ఉండి నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సిద్ధమైన గృహసారథులు, వాలంటీర్లు, కన్వీనర్లు

ప్రజాశక్తి - భీమవరం

కుటుంబ భారాన్ని, బాధ్యతలను మోస్తున్న నాన్నో.. అమ్మో.. అన్నో.. భర్తో.. లేక అక్కో మా గృహాలకు సారథులవుతారేగాని వేరే ఇంటికి చెందినవారు ఎలా సారథులవుతారని ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న వారు ప్రశ్నిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న విపక్షాలు వైసిపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నెల ఏడో తేదీ నుంచి జిల్లాలో వైసిపి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. జిల్లావ్యాప్తంగా 14 రోజులపాటు 4,16,914 కుటుంబాలను వైసిపి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో గృహాలకు వచ్చేవారిని అడ్డుకునేందుకు టిడిపి, జనసేన సమాయత్తమవుతున్నాయి.

ప్రభుత్వం మరో కొత్త ప్రచార కార్యక్రమానికి తెరలేపింది. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆ పార్టీ 'మా నమ్మకం నువ్వే జగన్' పేరిట స్టిక్కర్లు అతికించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలో ఈ నెల ఏడో తేదీ నుంచి 20వ తేదీ వరకూ 'జగనన్నే మన భవిష్యత్తు' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లాలో భీమవరం, నరసాపురం డివిజన్లతోపాటు జిల్లాలో నూతనంగా కలిసిన గణపవరం మండలంతో కలుపుకుని 20 మండలాలున్నాయి. వాటి పరిధిలో 383 గ్రామ సచివాలయాల పరిధిలో 9,400 మంది వాలంటీర్లు పని చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 18.45 లక్షల జనాభా, సుమారు 4.70 లక్షల కుటుంబాలున్నాయి. సచివాలయానికి ముగ్గురు వైసిపి 'కన్వీనర్లు' చొప్పున 1,152 మందితోపాటు ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున సుమారు వేలాది మంది గృహసారథులను వైసిపి నియమించింది. వాలంటీర్లతోపాటు ఇటీవల వైసిపి నియమించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు భాగస్వాములు కానున్నారు. దీంట్లో భాగంగా సచివాలయాలవారీగా జిల్లావ్యాప్తంగా సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో గురువారం సమావేశాలు నిర్వహించారు. సమగ్రవంతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎలు, మంత్రులు దిశానిర్దేశం చేశారు. 14 రోజులపాటు జరిగె కార్యక్రమంలో ప్రతి ఇంటిని, కుటుంబాన్నీ సందర్శించనున్నారు. ఏడాదిలో ఎన్నికలున్నందున ప్రచార జోరు పెంచే వ్యూహంతో వైసిపి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అయితే వాలంటీర్లు మాత్రం క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు సంకోచిస్తున్నారు. దీనికితోడు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ తరుణంలో ప్రతి ఇంటికీ వెళ్లి స్టిక్కర్లు వేయడం సాధ్యమా అనే అనుమానంతో ఉన్నారు. అధికారులు మాత్రం తప్పనిసరిగా స్టిక్కర్లు వేయాలని, పథకాలు వర్తిస్తున్నప్పుడు కాదనకుండా నచ్చజెప్పే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. అయితే ఇది ఎంతవరకూ ఆచరణ సాధ్యమో అర్థం కావడం లేదని వాలంటీర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద ఎంఎల్‌ఎలనే నిలదీసిన పరిస్థితులు గుర్తు చేసుకుంటున్నారు. మాస్థాయిలో ఇంటికెళ్తే ఎదురయ్యే పరిస్థితులను ఎలా అధిగమించగలమని వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆందోళన పడుతున్నారు.

ఇంటింటి ప్రచారం ఇలా..

ఇద్దరు గృహసారథులు గ్రామ, వార్డు వాలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లాలంటూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. 'మిమ్మల్ని మీరు వైసిపి ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలని సూచించింది'. లబ్ధిదారుల ఇళ్లకు వాలంటీర్లు ప్రభుత్వ ఆసరా లేఖను అందించాలని ఆదేశించారు. గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ముందుగా గత, ప్రస్తుత పాలనను పోల్చే కరపత్రాన్ని చదివి వివరించడంతోపాటు వారికి కరపత్రాన్ని అందించాలని సూచించారు. ప్రజామద్దతు పుస్తకంలోని ప్రశ్నలను చదివి, వారి సమాధానాలను స్లిప్‌లో నమోదుచేయాలి. ఇంటి వారి పేరు, వారి ఫోన్ నంబరు స్లిప్ మీద రాయమంటున్నారు. ప్రశ్నలకు ఇంటి యజమాని సమాధానం ఇవ్వను అయితే స్లిప్‌లోని కింది భాగాన్ని చింపి వారికి ఇవ్వాలని సూచించారు. 82960 82960 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి జగనన్నకు మద్దతు తెలపమని కోరాలని పేర్కొన్నారు. ఇంటివారి అనుమతితో వారి ఫోన్ వెనుక మొబైల్ స్టిక్కర్, తలుపు బయట డోర్ స్టిక్కర్ అంటించాలని ఆదేశించారు. వాటిని ఫొటో తీసి మీ జెసిఎస్ మండల వాట్సాప్ గ్రూపునకు పంపాలని కోరారు. ఇవన్నీ ఎలా అమలు చేయగలమని వాలంటీర్లతోపాటు గృహ సారథులు మదనపడుతున్నారు.

కిట్ల పంపిణీ

మండలాలవారీగా ఇప్పటికే కిట్లను గృహ సారథులకు, వాలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు అందజేశారు. ఇప్పటికే వీరికి శిక్షణ కూడా అందించారు. ప్రతి కిట్‌లో 200 ఇళ్లకు సరిపడా ప్రచార సామగ్రిని ఉంచారు. గృహ సారథులు ధరించేందుకు ఐదు బ్యాడ్జీలు, స్లిప్‌లు నింపేందుకు ఐదు పెన్నులు, గత, ప్రస్తుత ప్రభుత్వాలను పోల్చే కరపత్రాలు 200, ఫోనుకు అతికించేందుకు 200 మొబైల్ స్టిక్కర్లు, జగనన్న ప్రభుత్వంపై ప్రజామద్దతు సేకరించేందుకు 75 స్లిప్‌లు గల నాలుగు పుస్తకాలు, తలుపులపై అంటించేందుకు డోర్ స్టిక్కర్లు 200, ప్రచార సామగ్రిని పంచేందుకు మూడు అదనపు బ్యాగ్‌లు పంపిణీ చేశారు.

ప్రభుత్వంపై విమర్శలు

జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో వైసిపి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల విధుల నుంచి వాలంటీర్లను దూరం పెట్టాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో వైసిపి గృహసారథులను, కన్వీనర్లను ఏర్పాటు చేసిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల రానున్న నేపథ్యంలో వాలంటీర్లతో గృహసారథులను కన్వీనర్లను ఇప్పటి నుంచి మమేకం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన పార్టీలు ఈ కార్యక్రమ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు అంగీకరించకపోతే ముఖ్యమంత్రి జగన్‌కు అనుకూలంగా లేకపోతే పథకాలు ఆపివేస్తారేమో ప్రచారం జరుగుతోందని, ప్రతి గ్రామంలోని ప్రజలు, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విధానాన్ని అడ్డుకుని ఒక వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రసారమాధ్యమాలలో టిడిపి విస్తృత ప్రచారం చేసింది. ఈసారి టిడిపి, జనసేన ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది.

ధాన్యం కొనుగోలు

సాఫీగా సాగేనా..!

సంచుల బాధ్యత మిల్లర్లకు అప్పగించడంపై ఆందోళన

మిల్లుల కేటాయింపుపై ఇంకా స్పష్టత ఇవ్వని అధికారులు

15 నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు

లారీలు, సంచుల సమస్యపై రైతుల్లో వీడని ఆందోళన

నిడమర్రు మండల ధాన్యం గణపవరం మిల్లులకు కేటాయిస్తేనే మేలు

తేమ, తూకంలో మిల్లర్ల నిరంకుశ వైఖరికి అడ్డుకట్ట వేయాలని చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ ధాన్యం కొనుగోలు ఏ ఇబ్బందులూ లేకుండా సాఫీగా సాగేనా అంటూ రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించేందుకు పడ్డ కష్టాలను గుర్తు చేసుకుంటూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో అధికారులు తీసుకుంటున్న చర్యల వల్ల రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. రబీలో రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. సాగునీటి కష్టాలను దాటుకుంటూ పంట చివరి దశకు చేరుకుంది. వారం, పది రోజుల్లో రైతులు రబీ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభించనున్నారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు పడ్డ ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ గుబులు చెందుతున్నారు. గడిచిన ఖరీఫ్‌లో మిల్లరు, సహకార సంఘాలతోపాటు వివిధ రకాలుగా రైతులకు సంచులు అందించే ప్రక్రియ నడిచింది. అయినప్పటికీ రైతులకు సక్రమంగా సంచులు అందించలేకపోయారు. దీంతో సంచుల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రబీలో రైతులకు సంచులు అందించే పూర్తి బాధ్యతను మిల్లర్లకు అప్పగించినట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే సంచులు రైతులకు సక్రమంగా అందేనా అనే భయం అందరినీ వెంటాడుతోంది. మిల్లర్లు ఎక్కువగా కమీషన్ వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుంటారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సంచులు సకాలంలో అందించేందుకు ఇష్టపడరనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కమీషన్ వ్యాపారులను ధాన్యం కొనుగోలు చేసేవిధంగా ప్రోత్సహిస్తున్న పరిస్థితి ఉంది. అదే సమయంలో మద్దతు ధర దక్కేవిధంగా కూడా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో లారీల సమస్య తీవ్రమైంది. రబీలో లారీల సమస్య లేకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఇప్పటి వరకూ సరైన స్పష్టత ఇవ్వలేదు. దీంతో లారీల పరిస్థితి ఏమిటనే భయం రైతులను వెంటాడుతోంది.

మిల్లర్ల నిరంకుశ వైఖరికి అడ్డుకట్ట పడేనా

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో రైతులను మిల్లర్లు నానా ఇబ్బందులకు గురిచేశారు. దీంతో రబీలో ధాన్యం కొనుగోలుపైనా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తేమశాతం, తూకం పేరుతో రైతుల నుంచి డబ్బు వసూలు చేసిన పరిస్థితి ఖరీఫ్‌లో పెద్దఎత్తున సాగింది. రైతుభరోసా కేంద్ర అధికారులు తేమశాతం నిర్ధారించిన తర్వాత కూడా తేమ 17 శాతం కంటే ఎక్కువగా ఉందంటూ ధాన్యం రోజుల తరబడి దింపుకోకుండా నిలుపుదల చేయడం, తేమ శాతానికి లెక్కల కట్టి డబ్బు వసూలు చేయడం జరిగింది. తూకం విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతోపాటు నానా ఇబ్బందులు పడ్డారు. తేమశాతం, తూకం నిర్ధారణ విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని, మిల్లర్ల నిరంకుశ వైఖరిని అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. తేమ, తూకం నిర్ధారణ విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నారో ఇప్పటికే సరైన స్పష్టత లేదు. రబీలోనూ ఈసమస్యలు పునరావృతమైతే తీవ్ర ఇబ్బందులు తప్పవని అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు.

గణపవరంలో మిల్లులు కేటాయిస్తేనే మేలు

నిడమర్రు, గణపవరం మండలాలు రెండూ అంటిపెట్టుకుని ఉంటాయి. గడిచిన ఖరీఫ్‌లో గణపవరం మండలం ఏలూరు జిల్లాలోనే ఉంది. దీంతో నిడమర్రు మండలానికి సంబంధించిన రైతులంతా గణపవరంలోని మిల్లులకే తమ ధాన్యం విక్రయించారు. లారీలు దొరక్కపోతే పక్కనే మిల్లులు ఉండటంతో ట్రాక్టర్లతో తమ ధాన్యాన్ని తరలించారు. ఇప్పుడు గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోకి చేరింది. జిల్లా మారిందనే కారణంతో నిడమర్రు మండలంలోని రైతులకు గణపవరంలోని మిల్లులు కేటాయించకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడే పరిస్థితి రానుంది. ఇది రైతులపై పెనుభారం పడటంతోపాటు రవాణాపరంగా ఇబ్బందులు రానున్నాయి. జిల్లాల విభజనతో సంబంధం లేకుండా నిడమర్రు మండలంలోని ధాన్యానికి గణపవరంలో మిల్లులు కేటాయిస్తేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల కేటాయింపులపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఆ మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యం : కలెక్టర్



తాడేరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్


ప్రజాశక్తి - భీమవరం రూరల్

నిరుపేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడానికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రవేశ పెట్టారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం తాడేరు గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పేదలందర్నీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడానికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాధిని గుర్తించడంతోపాటు దానిని తగ్గించేందుకు వివిధ రకాల వైద్య సేవలందించి మందులు ఇస్తారని తెలిపారు. పిహెచ్‌సిల్లో ఉన్న ఇద్దరు డాక్టర్లు ప్రతి ఇంటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి ముందుగా వారికి ఏ విధమైన జబ్బులున్నాయో గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వడం, వైద్యం అందించడంతోపాటు వారం వారం వారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తారని చెప్పారు. డాక్టర్ల బృందం ఆయా గ్రామాలకు వచ్చే ఒకరోజు ముందు ఎఎన్ఎం, ఆశా సిబ్బంది అక్కడ ప్రచారం సాగిస్తారని తెలిపారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేరులో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ వైద్యం' అనే కార్యక్రమంలో భాగంగా 104 వాహనాన్ని కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సంయుక్తంగా ప్రారంభించారు. వాహనంలోని వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాను నాయక్, హౌసింగ్ ఇఇ బి.వెంకటరమణ, తహశీల్దారు వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివ రామకృష్ణ, ఎంపిడిఒ శ్రీరామచంద్రప్రభు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహ రావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మాజీ ఎంపిపి బండి శక్తీశ్వర సాంబమూర్తి, వైద్యాధికారులు, ఎఎన్‌ఎంలు, సచివా లయ సిబ్బంది, ఆశాలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఉండి: కార్పొరేట్‌స్థాయిలో ప్రతిఒక్కరికీ ఉచిత వైద్యం అందిస్తున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. గురువారం మహదేవపట్నంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ మండలస్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గులిపల్లి అచ్చారావు, ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ముదునూరి సుబ్బరాజు, రణస్థల మహంకాళి, గుత్తుల కృష్ణ ప్రసాద్, బొక్కా శ్రీనివాస్, బాలం తులసి పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామాలలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందిస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులోని కుక్కలవారితోటలోని మూడో సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఇంటింటికీ వైద్యం కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. పిహెచ్‌సి వైద్యులు దినేష్ కుమార్, వైద్య సిబ్బంది ప్రసాద్‌రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, ఉప సర్పంచి బోణం నరసింహారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మాయ మాటలు నమ్మొద్దని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపికి మద్దతివ్వాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వైసిపి మండల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించారు. కొట్టు మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలంలో ఎన్నికల దృష్ట్యా అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతిపక్ష నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వానికి మద్దతివ్వాలని ఆయన కోరారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సమాజంలో ప్రతిఒక్కరి సంక్షేమం కోరుకునే సిఎం జగన్ అని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి మరో 10 అడుగులు ముందుకు వేసి ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తిస్థాయిలో డాక్టర్లు వైద్య సిబ్బంది నియామకం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలోనూ వైఎస్‌ఆర్ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో తనకు ప్రత్యర్థులుగా ఉన్న ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నేపథ్యాన్ని వారి గుణగణాలను పరిశీలించాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగేందుకు శాంతిభద్రతలు నెలకొనేందుకు తనకు ప్రతిఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. సభలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి శేషులత, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి, జగన్నాధపురం గ్రామ సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక, ఎఎంసి డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైకాల శ్రీనివాసరావు, వైద్యాధికారులు శైలజ, వెంకట్ ప్రవీణ్, రాజేష్ మాట్లాడారు. సభలో కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న పివిఎల్.నర్సింహరాజు



కొట్టును సత్కరిస్తున్న వైద్యులు

11న చలో విజయవాడ విజయవంతం చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న భీమారావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దళితులు, మైనార్టీలపై రాష్ట్రంలో నిత్యం జరుగుతున్న అకృత్యాలు, హత్యలు, దాడులకు వ్యతిరేకంగా దళిత, ప్రజా సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని సిపిఐ కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. గురువారం స్థానిక ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో దళిత, ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. దేశంలో దళితులపై దాడుల్లో ఎపి నాల్గోస్థానంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగానే దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. దళితుడిని హత్య చేసిన ఎంఎల్‌సి అనంతబాబు లాంటి వారిని వైసిపి నాయకులు పూలదండలతో సత్కరిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 11న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ దళితుల రక్షణకు ఎన్ని చట్టాలున్నా దాడులు ఆగడం లేదన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతికుమార్ మాట్లాడుతూ మనువాద ఎజెండాతో పని చేస్తున్న బిజెపి పాలిత రాష్ట్రాలతో సమానంగా మన రాష్ట్రంలోను దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దాడులకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ దళిత వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసిపికి గుణపాఠం చెబుతామన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు ఛాన్‌భాషా, వ్యకాస జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడారు.

నైపుణ్యాల మెరుగుతో ఉన్నత శిఖరాలకు

నాగపూర్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎఫ్.రాబిన్ సైమన్ - నిట్‌లో ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం



మాట్లాడుతున్న రాబిన్ సైమన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు తమలోని అపార శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని, అలాంటి మానవ వనరులే దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తాయని నాగపూర్ నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎఫ్.రాబిన్ సైమన్ అన్నారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థ వార్షిక క్రీడా దినోత్సవాన్ని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సాస్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సైమన్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమైందన్నారు. విద్యార్థుల లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభను కనబరిచి సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్యులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరిచేందుకు క్రీడలు వారధిగా నిలుస్తాయన్నారు. నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో క్రీడలకు ఎంతో గుర్తింపు, గౌరవం ఉన్నాయని, వాటిలో రాణిస్తూ విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు జిఆర్‌కె.శాస్త్రి, టి.కురుమయ్య, ఎన్.జయరామ్, ఆచార్యులు వి.సందీప్, రాముడు, వినోద్‌కుమార్ రాజా, అరుణ్ కుమార్, సంతోష్, కృష్ణమూర్తి, తపస్, తలారి రేష్మా, శ్రీనివాసరావు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్టుల దరఖాస్తులకు ఆహ్వానం

భీమవరం: 2023, 2024 సంవత్సరాల కాలానికి నూతన అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు నిబంధనలను రూపొందించి ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ ఛైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిఒలో మహిళా జర్నలిస్టులకు ప్రాధాన్యతనిస్తూ కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు సూచించారని పేర్కొన్నారు. మీడియాలో పనిచేస్తూ, అర్హులై, ఆసక్తి ఉన్న మహిళా జర్నలిస్టులను అక్రిడిటేషన్ కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన మహిళా జర్నలిస్టులు ఈ నెల పదో తేదీ సాయంత్రంలోపు స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని డిఐపిఆర్‌ఒ కార్యాలయానికి చేరేలా దరఖాస్తులు పంపాలని సూచించారు.

యువకుని అనుమానాస్పద మృతి

తణుకు రూరల్: మండలంలోని వెంకట్రాయపురం గ్రామానికి చెందిన వేల్పూరి దుర్గాప్రసాద్(22) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం వెలుగుచూసింది. తణుకు రూరల్ పోలీసుల కథనం ప్రకారం వెంకట్రాయపురంలో దుర్గాప్రసాద్ తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రాజమండ్రికి చెందిన ట్రాన్స్‌జెండర్ రెజీనాతో ఆయనకు కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. ఈ నెల 4న మండపాకలో యల్లారమ్మ జాతరకు రెజీనా వచ్చింది. అదే రోజు రాత్రి కాలువ పక్కనే ఉన్న రేకుల షెడ్డులో రెజీనా, దుర్గాప్రసాద్ కలిసి మద్యం సేవించారు. తెల్లవారుజాము నుంచి దుర్గాప్రసాద్ కన్పించకపోవడంతో ఆయన తల్లి మహాలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యర్రనీలిగుంట వద్ద ఉన్న కాలువలో దుర్గాప్రసాద్ మృతదేహం గురువారం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా రూరల్ ఎస్ఐ గుర్రయ్య కేసు నమోదు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలి పారు. గురువారం మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో, ఆలమూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద డ్వాక్రా మహి ళలకు మూడో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో వేల మంది మహిళలకు ఆసరా అందిం చారని, 14 వేల మందికి ఇళ్ల పట్టాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని తెలిపారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోబోయే రోజుల్లో రాష్ట్రాన్ని శ్రీలంక మాదిరిగా కరువు కాటకాలతో మారిపోతుంద ని విమర్శించారని, ఆ నోటితోనే వచ్చే ఎన్నికల్లో తన ప్రభుత్వం వచ్చినా ప్రస్తుత ప్రభుత్వ పథకాలను అమ లు చేస్తాం హామీ ఇవ్వడం సిగ్గుగా లేదా అని విమర్శిం చారు. అనంతరం మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మట్టా కుమారి, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), వెలగలేరు, నెగ్గిపూడి సర్పంచులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయ ఇఒగా
అరుణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఇఒగా మోకా అరుణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇఒగా పనిచేసిన చాగంటి సురేష్ నాయుడు సాధారణ బదిలీలో భాగంగా భీమవరం పట్టణంలోని గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయ ఇఒగా బదిలీపై వెళ్లారు. అక్కడ ఆలయ ఇఒగా పనిచేస్తున్న మోకా అరుణ్ కుమార్ కాళ్లకూరు బదిలీపై వచ్చారు. అనంతరం బదిలీ అయిన సురేష్ నాయుడు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

రైల్వే వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రపంచంలోనే భారత రైల్వేకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఇటీవల కాలంలో రైల్వే పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, ఈ వారోత్సవాలను 3 దశాబ్దాలుగా నిర్వహిస్తున్నామని భీమవరం రైల్వే జంక్షన్ స్టేషన్ మేనేజర్ వానపల్లి చక్రవర్తి అన్నారు. గురువారం రైల్వే జంక్షన్ స్టేషన్‌లో భీమవరం రైల్వేశాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే భారత రైల్వే వారోత్సవాల బ్రోచర్‌ను చక్రవర్తి ఆవిష్కరించి మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రజలకు, ప్రయాణికులకు ఈ వారోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. 8న పట్టణ రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామని, ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు, హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు ఎం.సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

'మద్యం పేరుతో వేల కోట్లు దోపీడీ'

ప్రజాశక్తి - భీమవరంరూరల్

అధికారంలోకి వస్తే మద్యం నిషేధం విధిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మద్యం అమ్మకాలతో వేల కోట్లు దోచుకున్నారని టిడిపి రాష్ట్రకార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ గత నాలుగేళ్లు నాసిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ తన సొంత దుకాణాల ద్వారా అమ్ముతూ రూ.41 వేల కోట్లు దోచుకుని ప్రజల ధన, ప్రాణాలను హరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక నేషనల్ ఇంటర్నేషనల్ మద్యం బ్రాండ్లను రద్దుచేసి తన బినామీల డిస్టలరీలో తయారైన నాసిరకం మద్యం విక్రయించి వేలకోట్ల దండుకున్నారని విమర్శించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, వీరవాసరం మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్, భీమవరం మండల ప్రధాన కార్యదర్శి కవురు పృథ్విశంకర్ మాట్లాడారు. ఈ సమావేశంలో భీమవరం మండల అధ్యక్షుడు రేపు వెంకన్న, వీరవాసరం మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి చంటిరాజు

శృంగవృక్షంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని చిన్నపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.6 లక్షలు, పంచాయతీ నిధుల నుంచి రూ.లక్ష మొత్తం రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతినిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగం సూరిబాబు, ఉప ఎంపిపి నరేష్, ఎంపిటిసి సభ్యురాలు బల్ల భారతి పాల్గొన్నారు.

గంగిశెట్టి జీవితం ఆదర్శం కావాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కమ్యూనిస్టు ఆశయ సాధనే లక్ష్యంగా కష్టజీవుల అభ్యున్నతికి నిస్వార్ధంగా జీవితాంతం శ్రమించిన తొలితరం కమ్యూనిస్టు కడలి గంగిశెట్టి జీవితం అందరికీ ఆదర్శం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సిపిఐ తొలితరం నేత కడలి గంగిశెట్టి సంతాప సభ గురువారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు గంగిశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలో అసమానతలు, దోపిడీలేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా గంగిశెట్టి ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పోలీసుల అక్రమ నిర్బంధాలు, అణచివేతను లెక్కచేయకుండా పనిచేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్ సంతాప సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సిపిఐ ఉద్యమాభివృద్ధికి గంగిశెట్టి ఎనలేని కృషి చేశారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠం మాట్లాడుతూ గంగిశెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, ఛాన్ భాషా, రాంబాబు గంగిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గూడెంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో పోలీస్ ఐ ల్యాండ్ సెంటర్లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద చలివేంద్రాన్ని సంఘం గౌరవాధ్యక్షులు నంద్యాల కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సంఘం తరపున 15 సంవత్సరాలుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షులు నిమ్మల వినాయకరావు, కార్యదర్శి జంగా శ్రీనివాసరాయ్, ట్రెజరర్ వట్టిపులుసు సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - ఆకివీడు

ఆర్‌బికెల ద్వారా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొనుగోలు సాంకేతిక సిబ్బందికి జిల్లా పౌరసరఫరాల శాఖా జిఎం తెలిపారు. త్వరలో దాళ్వా పంట చేతికి రానున్న నేపథ్యంలో పంట కొనుగోళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో అవగాహన కల్పించారు. పౌర సరఫరాల శాఖ జిల్లా కార్యాలయానికి చెందిన సాంకేతిక సిబ్బంది మాస్టర్ ట్రైన్స్ నవీన్ కుమార్, మల్లమ్మ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, ఎండిఒ శ్రీకర్, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

చీటీల పేరుతో రూ.3 కోట్లకు కుచ్చుటోపీ
శ్రీనివాసరాజు అరెస్టు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో పాట చీటీలు వేసి పాడుకున్న వారికి సొమ్ములు ఇవ్వకుండా రూ.మూడు కోట్లు పాటదారులకు కుచ్చుటోపీ పెట్టిన ముదునూరి శ్రీనివాసరాజుపై గురువారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక గొల్లలదిబ్బ ప్రాంతానికి చెందిన ముదునూరి శ్రీనివాసరాజు పాట చీటీలు వేస్తూ చీటి పాడుకున్నవారికి సొమ్ములు ఇవ్వకుండా కాలయాపన చేసేవాడని తెలిపారు. అంతేకాకుండా పాటదారులు వద్ద అప్పులు చేసేవాడని తెలిపారు. అయితే సొమ్ము ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న శ్రీనివాస్ రాజుపై పాటదారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అతనిని అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

పసర్ల నీరే దిక్కు..!
గుమ్మలూరులో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోనే పెద్ద పంచాయతీలో ఒక్కటైన గుమ్మలూరు గ్రామంలో తాగునీటి కోసం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కుళాయి ద్వారా సరఫరా చేసే నీరు పూర్తిగా పసరు రంగులో ఉండి మట్టి వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మలూరు పంచాయతీలో దాదాపు 5 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అయితే సమస్య గురించి ఎన్నిసార్లు అధికారులకు, సర్పంచికి మొర పెట్టుకున్నా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. రోజుకు ఒక్కపూట మాత్రమే కుళాయి నీరు ఇస్తున్నారని, అవి కూడా పూర్తిగా తాగడానికి పనికిరావని వాపోతున్నారు. రోజూ ద్విచక్ర వాహనాలపై 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొల్లు మున్సిపాల్టీ నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. అంతదూరం వెళ్లి నీరు తెచ్చుకోలేని వారు ఈ నీటినే తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి శుద్ధి చేసిన తాగునీరు అందిచాలని కోరారు.



పసరగా వచ్చిన కుళాయి నీరు

'వైసిపి పాలనతో విసుగు'

మొగల్తూరు: వైసిపి పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. గురువారం సాయంత్రం శేరేపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పులపర్తి త్రిమూర్తులు, కత్తుల సత్యనారాయణ, దుసనపూడి ఏసు, ఆకన కోటి, అడ్డాల బాబ్జి, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

సోపేటి సాయికుమార్, తండ్రి: సింహాద్రి నాయొక్క పాస్‌పోర్టు పోయినది. లంకలకోడేరు ఇంటి నుండి పాలకొల్లు వెళుచుండగా మార్గ మధ్యంలో పోయినది. నాయొక్క పాస్‌పోర్టు నెం. **X0582768** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

సోపేటి సాయికుమార్
తండ్రి: సింహాద్రి, డో.నెం. 4-14,
రజక వీధి, లంకలకోడేరు,
పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 86865 55547

సిపిఎం నేత సూర్యారావు కుమార్తె విజయలక్ష్మి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు కుమార్తె చింతపల్లి విజయలక్ష్మి (62) పాలకొల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం ఉదయం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, జవ్వాది శ్రీనివాస్, సిపిఎం యలమంచిలి మండల కార్యదర్శి కానేటి బాలరాజు విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట ఐద్వా నాయకులు పి.ప్రశాంతి, సిహెచ్ సత్యనారాయణమ్మ, ఎస్.నాగమణి, ఎం.జయశ్రీ, పి.సుభద్ర, నాయకులు ఎం.ఆంజనేయులు, జి.సత్యనారాయణ, టి.స్టాలిన్, ఎం జైసింఫ్, ఎం.రాజేష్, పి.వెంకటస్వామి, నాని, ఎం.చిట్టి ఉన్నారు.



విజయలక్ష్మి (ఫైల్‌ఫోటో)




విజయలక్ష్మి భౌతికాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం
శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళల్లో వచ్చే ప్రసూతి సమస్యలను గుర్తించేందుకు ఉచిత వైద్య శిబిరాలు, మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. గురువారం భీమవరం పురపాలక సంఘం పరిధిలో శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపంలో భీమవరం ఆబ్స్టెట్రిక్స్ గైనిక్ సొసైటీ (బోగస్సి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని పేదల సేవ చేయాలనే ధృకృథంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. డిఆర్ఒ కె.కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ రోజుల్లో కేన్సర్ చిన్న వయసులో కూడా వస్తోందని, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం ఉత్తమం అన్నారు. సంస్థ ప్రెసిడెంట్ పద్మావతి, ఆమె తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భీమవరంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు మాట్లాడుతూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ఉచిత క్యాంపు బోగిస్సి సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివేజ్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోగిస్సీ సంస్థ సెక్రటరీ జి.సుజియశ్రీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుంకర నరసవాణి, ట్రెజరర్ డాక్టర్ రమ్య పాల్గొన్నారు.




వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

అపుస్మా పాలకొల్లు జోన్ అధ్యక్షునిగా కృష్ణవర్మ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపి రాష్ట్ర ప్రయివేటు స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) పాలకొల్లు జోన్ అధ్యక్షులుగా 2023 - 24 విద్యా సంవత్సరానికి పట్టణంలోని మాంటిస్సోరీ స్కూల్, జూనియర్ కాలేజీ సెక్రటరీ కెవి.కృష్ణవర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సన్‌షైన్ స్కూల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో పాలకొల్లు జోన్‌కు సంబంధించిన అన్ని ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. కార్యదర్శిగా గురుకుల విద్యాలయ ఛైర్మన్ గొర్ల శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్ కరస్పాండెంట్ మద్దాల వాసు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపర్చేందుకు ప్రత్యేక శిక్షణాకార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థుల ఉన్నతికి అవసరమైన పోటీ పరీక్షలకు సంబంధించి ప్రణాళికా బద్ధమైన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు పాపారావు నాయుడు, పూర్వాధ్యక్షులు మద్దాల రాంప్రసాద్, రావూరి అప్పారావు, ఐడియల్ సుబ్బారావు, చల్లా ఆదినారాయణ, రాపాక రత్నరాజు, వి.సాయిబాబా, షాజహాన్ పాల్గొన్నారు.



అపుస్మా పాలకొల్లు జోన్ అధ్యక్షులుగా ఎన్నికైన కృష్ణవర్మ

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం బొండాడపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పివిఎల్ నరసింహరాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలని ప్రతి మారుమూల గ్రామానికి కూడా వైద్యం అందాలనే ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. బిపి, మధుమేహం, ఇతర జబ్బులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, సిసలి వైసిపి నాయకులు రాంబాబు, కాళ్ల సర్పంచి బందా విజయ, బొండాడపేట సర్పంచి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం : సామాన్యులకు ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో రెండో సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నెలకు రెండు రోజులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మేలైన వైద్యం అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) తెలిపారు. కుముదవల్లిలో గురువారం పాలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ స్వర్ణ నిరంజని ఆధ్వర్యంలో సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అధ్యక్షతన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించింది. ఎపిజెషన్ క్యాంపును ఎంపిపి సత్య నారాయణ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. నెలకు రెండుసార్లు వైద్యులు గ్రామంలోనే ఉంటూ వారికి అన్ని రకాల వైద్యం అందిస్తూనే ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. డాక్టర్ స్వర్ణ నిరంజని మాట్లాడారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, పిహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, నాగమణి పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసు బాబు

ఘనంగా హరిరామజోగయ్య పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకొల్లు

మాజీ మంత్రి, కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి వెంకట హరి రామజోగయ్య 87వ పుట్టినరోజును పురస్కరించుకుని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలు జిల్లాకు, పాలకొల్లు నియోజకవర్గానికి అవసరమని ప్రశంసించారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ద్వితీయ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న భీమవరంలో జరగనుందని, సమావేశాన్ని జయప్రదం చేయాలని అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి గుమ్మల్ల జకరయ్య పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన విఆర్‌ఒల డివిజన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రేడ్-2 విఆర్‌ఒలకు, గ్రేడ్-1 విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇచ్చిన 166 జిఒ పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒల డివిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కెడిఎస్ కెనడీ, ఉపాధ్యక్షులు వై.దానయ్య, కార్యదర్శి పంపన సురేష్, సంయుక్త కార్యదర్శి నిమ్మల రామాంజనేయులు పాల్గొన్నారు.

పిచ్చిరెడ్డి విగ్రహం నమూనా పరిశీలన

పెనుమంట్ర: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా సాయుధపోరాట యోధుడు గుంటకండ్ల పిచ్చిరెడ్డి విగ్రహం నమూనాను ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. నత్తా రామేశ్వరం అరుణ్‌కుమార్ ఆర్ట్స్ శిల్పాశ్రమంలో రూపొందుతున్న విగ్రహ నమూనాను పరిశీలించి శిల్పి కరుణాకర్ ఉడయార్‌కు కొన్ని సూచనలు చేశారు. శిల్పాశ్రమంలో తయారీలో ఉన్న పలు విగ్రహాలను ఆయన తిలకించారు. శిల్పకళా రంగంలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఎకెఆర్ శిల్పులకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. భవిష్యత్తులో శిల్ప రంగాన్ని అభివృద్ధి చేసేందుకు శిల్ప ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి, యువతరానికి శిల్ప రంగం పట్ల ఆసక్తిని కలిగించాలని కోరారు. శిల్పాశ్రమంలో కూర్చుని ఉన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని చూసి తన చిరకాల మిత్రుడిని గుర్తు చేసుకున్నారు. శ్రీనివాసరెడ్డి వెంట ఆయన సతీమణి భారతి, మనుమరాలు సంజన ఉన్నారు.

నేడు పొలమూరులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 7వ తేదీన పొలమూరులో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ ప్రారంభించనున్నట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి నాగలదిబ్బ, చెన్నాడచెరువు ఏరియాలో జరగనున్న కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. వైసిపి గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని తెలిపారు.

యువగళానికి అపూర్వ స్పందన
టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి

ప్రజాశక్తి - ఉండి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. గురువారం వెలివర్రు గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరాజు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన నారా లోకేష్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన గురించి ప్రజలకు ముఖ్యంగా యువతకు తెలియజేస్తున్నారన్నారు. 2024లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని నారా లోకేష్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు. యువ గళం కార్యక్రమంలో తనతో పాటు పర్యటించవలసిందిగా నారా లోకేష్ కోరినట్లు వెంకటేశ్వరరాజు తెలిపారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు

ప్రజాశక్తి - గణపవరం

జల జీవన మిషన్ పథకంలో ప్రతి గ్రామానికీ తాగునీరందించడానికి వీలుగా గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు గురువారం చిలకంపాడు జగనన్న కాలనీలో రూ.46 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరందించడానికి వీలుగా గ్రామాల్లో 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చుక్క అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.హరినాథ్‌రాజు, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, ఏలూరు
ఓ.ఎస్.నెం. 10/2020

బిట్వీన్:
వాది: మల్లిడి సునీల్ రెడ్డి
మరియు
ప్రతివాది:
అవ్వారు రమేష్, తండ్రి: (లేటు) నరసింహారావు, ప్లాట్ నెం.503, శ్రీనైనా టవర్స్, మోతేవారి తోట, అశోక్ నగర్, ఏలూరు, ప॥గో॥జిల్లా.

ఆర్డరు 5-రూల్ 20-సి.పి.సి. ప్రకారం దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావా నోటీసు అమలు జరుగునందున **ది.25-04-2023వ తేదీకి కోర్టు వారు వాయిదా వేసినారు.** ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు ప్రతివాది ప్రత్యక్షంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలసిందిగాను, లేని ఎడల ప్రతివాది పరోక్షంలో దావా తీర్మానం కాబడునని తెలియజేయడమైనది.

ఏలూరు, 25-03-23.
బి.గౌరీశంకర్,
ఎ.వి.ఎస్.సూర్యారావు,
అడ్వకేట్స్, ఏలూరు.

PUBLIC NOTICE
In The Court Of The Hon'ble Principal District Judge West Godavari District :: Eluru
E.P.No. 113/2022
In I.A.No. 748/2012
In O.P.No. 258/2011

Between:
Katreddi Satish ...D.H.R. /Petitioner
AND
Sri Pothineedi Vaddikasulu and Others ...J.D.R's /Respondents

TO: J.D.R.No.3 /R-3:
Pothineedi @Ravuri Anjali, D/o. Vaddikasulu, Hindu, Female, aged 26 years, R/. D.No. 4-39-8/1, 7th Ward, P&T Colony, Tadepalligudem, West Godavari District, Moblie No. 94419 74644, TPGJCJ.

Please take notice that the supra mentioned case stands posted to **18-04-2023 at 10:30 A.M.,** for your appearance. If you failed to appear before the said Hon'ble Court, the matter will be decided in your absence.

//By Order Of The Court//
Eluru, 05-04-23.
A.MANI KUMAR,
Advcate, Eluru.
Cell: 73826 38236